క్లుప్తంగా

వసతి గృహం ప్రారంభం



నూతన వసతి గృహాన్ని ప్రారంభించిన దృశ్యం

చిలమత్తూరు: మండల పరిధిలోని 44 వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్‌లో నూతన వసతి గృహాన్ని బుధవారం ప్రారంభించారు. ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ మహంతేష్ వసతి గృహాన్ని ప్రారంభించి మాట్లాడారు. తమ ట్రస్ట్‌లో శిక్షణ తీసుకొనే దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉండేందుకు రూ.25 లక్షలు వెచ్చించి వసతి గృహం నిర్మించామన్నారు. కార్యక్రమంలో పాన్ ఇండియా ఎల్ఆర్‌సీ హెడ్ చంద్రశేఖర్, సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, ట్రైనర్లు నరసింహమూర్తి, సిబ్బంది శంకర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: స్థానిక లేపాక్షి పంచాయతీ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి చోళసముద్రం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ కేశవమూర్తి రూ.11,116, మాజీ ఎంపీపీ వెంకటేశ్ రూ.5,116 విరాళం అందజేశారు. ఈమేరకు బుధవారం కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని ఇచ్చారు.

ఇద్దరు మహిళల అదృశ్యం



గంగరత్న



ఉమాదేవి

పావగడ: తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్లు ఎస్ఐ తారాసింగ్ బుధవారం తెలిపారు. లింగదహళ్లికి చెందిన గంగరత్న (29) ఈ నెల 2న అదృశ్యమైనట్లు ఆమె భర్త రామచంద్రప్ప ఫిర్యాదు చేశారన్నారు. అలాగే అరసికెరె గ్రామానికి చెందిన ఉమాదేవి (32) గత నెల నవంబర్ 16న అదృశ్యమైనట్లు ఆమె భర్త మంజునాథ్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మహిళల ఆచూకీ తెలిసిన వారు అరసికెరె పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని ఎస్ఐ కోరారు.

రథం మరమ్మతుకు సహకరించండి

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణస్వామి ఆలయానికి సంబంధించిన రథం మరమ్మతు పనులు ప్రారంభించినట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. రథం మరమ్మతుకు సుమారు రూ.12 లక్షలు ఖర్చు అవుతోందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున విరాళాలను అందించి సహకరించాలని కోరారు.

బాలకృష్ణన్ సేవలు మరువలేనివి



రక్తదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలను స్థాపించి పలువురికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు అందించడంతో పాటు విద్యాభివృద్ధికి కృషిచేసిన ఎల్‌జీ బాలకృష్ణన్‌ను మరవలేమని పలువురు పేర్కొన్నారు. బాలకృష్ణన్ జయంతి సందర్భంగా ఎల్ఆర్‌జీ పబ్లిక్ స్కూల్‌లో రెడ్ క్రాస్ బ్లడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్త దానం చేసిన వారికి రూ.లక్ష హెల్త్ ఇన్సూరెన్స్‌ను రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామ్మూర్తి, కార్యదర్శి బాల సుందరం, మానవతా రక్తదాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

చింత ఫలసాయం వేలం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ పరిధిలోని చింత ఫలసాయాన్ని కార్యదర్శి మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో వేలం వేశారు. దేవగానపల్లి, గౌడనకుంట గ్రామాల్లో ఉన్న చింత చెట్లను వేలం వేయగా రూ.3.6 లక్షలకు సురేష్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ రేషన్ డీలర్ రామాంజినరెడ్డి (50) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని రామాంజినరెడ్డి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు ఉన్నారు.

అంతా ఉత్తుత్తి ప్రచారమే !



రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పది రోజులుగా ప్రచారం

- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ప్రజలు
- మార్గదర్శకాలు రాలేదంటున్న అధికారులు
- గతంలో ఆమోదించిన వాటినీ పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అగళి: రేషన్‌కార్డులు, నూతన పింఛన్ల కోసం ఎంతో మంది అర్హులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోండంటూ సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో చాలా మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించాలని వేడుకుంటున్నారు. అయితే తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు అవుతున్నా నేటికీ పింఛన్లు, రేషన్‌కార్డులపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పొందుపరిచినా...

రేషన్ కార్డులకు గతేడాది డిసెంబర్ వరకూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అర్హత కలిగిన వారికి నంబర్లు కూడా కేటాయించారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపరిచినా ఇంత కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ఏడాది కాలంలో వివాహం చేసుకున్నవారు, ఒంటరి మహిళలు, ఇతర తరగతుల వారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేక ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూసున్నారు. కనీసం కార్డులో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేదని వాపోతున్నారు. కార్డులోని కుటుంబ సభ్యులు మరణిస్తే వారి పేరున కార్డు ఉంటే వారు ఈకేవైసీ చేస్తేకాని ఇతర సదుపాయాలు అందడం లేదు. రేషన్ కార్డు తదుపరి కుటుంబ పెద్ద పేరున మార్చడానికి కూడా ఇంత వరకూ తగిన మార్గదర్శకాలు రాలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 50 ఏళ్లు దాటిన వారికి కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రాకపోవడంతో వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు.

ఎన్నో తిప్పలు పడుతున్నా..



రేషన్ కార్డులో కొత్తగా సభ్యులను చేర్పించేందుకు రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగున్నా ఎవరూ సరిగా చెప్పడం లేదు. కొన్ని పత్రికల్లో ఈ నెల 2 తేదీ నుంచి కొత్తగా రేషన్‌కార్డులు ఇస్తామని, కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని వార్తలు వచ్చాయి. అయితే క్షేత్ర స్థాయిలో అధికారులు ఇంకా వెబ్‌సైట్లో, ఆన్‌లైన్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. – ఈరన్న, అగళి

వలంటీర్ వ్యవస్థ లేకే ఇబ్బంది



గత ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ఉండేది. ప్రతి ఇంటికి వలంటీర్లు వచ్చి మాకు ప్రభుత్వం నుంచి కావాల్సిన అన్ని సర్టిఫికెట్లను ఇంటికే తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, జనన, మరణ సర్టిఫికెట్లు.1బి కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కార్యాలయంలో అధికారులు ఉంటారో లేదో తెలియదు. ఉన్నా ఆ వెబ్‌సైట్ పనిచేస్తుందో లేదో తెలీదు. – సతీస్, గ్యారగోండపల్లి, అగళి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు



నూతన రేషన్‌కార్డులు, పింఛన్లపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే తప్పకుండా రేషన్‌కార్డులు, పింఛన్లను దరఖాస్తులు స్వీకరిస్తాము. ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనలమేరకు కార్డులు, సామాజిక పింఛన్లు మంజూరు చేస్తాము. – సుబ్బరావు, తహసీల్దార్, అగళి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపార్లపల్లి వార్డు సభ్యుడు హనుమంతరాయప్పను బుధవారం ఆయన పరామర్శించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఆరు నెలలు పూర్తయినా అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ వచ్చినా పెట్టుబడి సాయం రూ.20 వేల రైతు ఖాతాల్లోకి జమ చేయలేదన్నారు. దీంతో అప్పులు చేసి రైతులు రబీ పంటలను సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించి రైతుకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆలయాల్లో పూజలు

మడకశిర మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప బుధవారం దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు మూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు ప్రకాష్, నాయకులు సత్యనారాయణయాదవ్, విశ్వనాథ్, శేఖర్, సుధాకర్, నారాయణప్ప, రంగనాథ్, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

'సున్నపుకట్టు'తో జాగ్రత్త !

- సస్యరక్షణతో పట్టు రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చంటున్న శాస్త్రవేత్తలు



సున్నపుకట్టు వ్యాధి సోకి తెల్లబారిపోయి చాక్‌పీస్‌లా మరిన పట్టుపురుగులు

హిందూపురం: పట్టుపురుగు పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తే శీతాకాలంలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టు పరిశోధన, అభివృద్ధి సంస్థ కిరికెర కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ కె.ఇబ్రహీంబాషా, డాక్టర్ ఎస్‌వి. శేషగిరి శాస్త్రవేత్తలు తెలిపారు. శీతాకాలంలో సాధారణంగా ఎక్కువ తేమ శాతం ఉన్న ప్రాంతాల్లో సిలింద్రాలచే వ్యాప్తి చెందే సున్నపుకట్టు వ్యాధి విజృంభిస్తుందన్నారు.

సున్నపుకట్టు వ్యాధి లక్షణాలు

- వ్యాధి సోకిన పురుగులు జీర్ణశక్తి, చురుకుదనం కోల్పోతాయి. వ్యాధి సోకిన పురుగులు మొదట్లో వాంతి చేసుకుని మెత్తపడిపోతాయి.
- పట్టు పురుగులపై నూనె బిందువు లాంటి మచ్చలు ఏర్పడతాయి.
- సున్నపు కట్టు వ్యాధి సోకిన తర్వాత పట్టు పురుగుల శరీర పరిమాణాన్ని బట్టి చాకీ పట్టు పురుగులైనట్లయితే 2 నుంచి 3 రోజుల్లో, పెద్ద పురుగులుగా మారి 4 నుంచి 5 రోజుల్లో ఈ సున్నపు కట్టు వ్యాధి లక్షణాలతో పూర్తిగా చనిపోతాయి.

నివారణ చర్యలు

- పట్టు పురుగుల పెంపకం గదిలో వెట్ అండ్ డ్రై బల్బ్ థర్మామీటర్ లేదా డిజిటల్ హైగ్రోమీటర్‌ను ఉపయోగించి గదిలో ఎప్పటికప్పుడు ఉష్ణోగ్రత తేమశాతాన్ని పరిశీలించి నియంత్రణ చర్యలు చేపట్టాలి.
- పట్టుపురుగుల పెంపకం గదుల్లో తేమశాతం పెంచేలా ఉన్న తడి గోనసంచి, తడి ఇసుక, పారపిన్ పేపరు, ఫాగర్స్, హుమిడి ఫైర్‌లను ఉపయోగించకూడదు.
- తేమశాతం తగ్గించేలా రాళ్ల సున్నం, బొగ్గు కుంపట్లు, హీటర్లను రేరింగ్ గదిలో ఉపయోగించి తేమ, ఉష్ణోగ్రతను నియంత్రించాలి.
- సున్నపు కట్టు వ్యాధి వచ్చిన పురుగులు గట్టి పడకముందే వాటిని వేరుచేసి వాటిపై విజేత సప్లిమెంటు, 2 శాతం డైతేన్ ఎం-45, కెవోలిన్ మిశ్రమాన్ని చల్లాలి. లేకపోతే 20 గ్రాముల క్యాప్టప్ పౌడర్‌ను 1 కేజీ సున్నంతో కలిపి చల్లవచ్చు.
- వ్యాధి సోకిన పట్టుపురుగులను ప్రాథమిక దశలోనే గుర్తించి వాటిని మాత్రం వేరు చేసి కాల్చి వేయడం మేలు.
- సున్నపు కట్టు వ్యాధి నివారణకు కొమ్మ మేత విధానంలో 100 గుడ్లకు తగినంత సున్నం పొడి, 6 కేజీల విజేత, 4 కేజీల విజేత సప్లిమెంటు ఉపయోగించవచ్చు.



ఖాజాలు కొనుగోలు చేస్తున్న భక్తులు

నోరూరిస్తున్న ఖాజా

పెనుకొండ: పట్టణంలో బాబయ్యస్వామి ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రోజూ వేల మంది భక్తులు స్వామి వారిని దర్గాను దర్శించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఉరుసులో లభించే ఖాజాను భక్తులు, ఉరుసుకు వచ్చిన వారు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. ఖాజా కోసమే ఇక్కడి వచ్చే వారు కూడా ఉన్నారంటే దాని రుచి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

భక్తిశ్రద్ధలతో కనకదాస జయంతి



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలో బుధవారం కురుబ కులస్తుల ఆరాధ్యదైవం కనకదాస జయంతి వేడుకలను కురుబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కనకదాస విగ్రహానికి పూలమాలలు పూజలు చేశారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ కరియన్న మాట్లాడుతూ కురుబ కులస్తులు పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం రాత్రి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్రీ హోల్డ్ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆర్‌డీఓ ఆనంద్ కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

అగళి: మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు విద్యుత్ వాడకంలో పొదుపుపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ్ ఎనర్జీ, సేవ్ ఎర్త్ నినాదాలతో మండల కేంద్రంలో ప్రజలకు విద్యుత్ వాడకంలో పొదుపుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జాఫర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సూర్యఘర్' పై అవగాహన

గోరంట్ల: స్థానిక వాసవీ మహాల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం విద్యుత్‌శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సూర్యఘర్ యోజన పథకంపై మహిళా సంఘాల మహిళలకు, విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్‌శాఖ ఈఈ శివకుమార్ హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్ ఉత్పాదనే లక్ష్యంగా ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ప్రవేశపెట్టిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. ప్రతి ఇంటిపైనా సౌరవిద్యుత్ పేట్లు అమర్చుకుంటే విద్యుత్ చార్జీల భారం తగ్గడంతో పాటు ఇతరులకు సైతం సౌర విద్యుత్‌ను అమ్ముకొనే అవకాశం ఉంటుందన్నారు.

కరికెరలో 'పొలం పిలుస్తోంది'

గుడిబండ: మండల పరిధిలోని కరికెర, చిగతుర్పి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ వీరనరేష్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం పొలాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు.

అణ్ణమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి వడిబియ్యం కడుతున్న దృశ్యం

లేపాక్షి: బెంగళూరు మహా సంస్థాన గ్రామదేవత అణ్ణమ్మ, చోళసముద్రం గ్రామ దేవత చౌడేశ్వరీదేవి అమ్మవార్లకు బుధవారం కరణం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మూడు రోజులుగా పూజలు అందుకున్న అణ్ణమ్మ దేవతను భక్తిశ్రద్ధలతో బెంగళూరుకు సాగనంపారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ సతీమణి కృష్ణప్రియ అమ్మవారికి వడిబియ్యం కట్టారు.

క్రీడల్లోనూ రాణించాలి

పెనుకొండ: విద్యార్థులు క్రీడల్లోనూ ఉన్నతంగా రాణించాలని ప్రగతి, గ్లోబల్ జెన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బాబయ్య దర్గా గంధం వేడుకలను పురస్కరించుకొని దర్గా నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గ్లోబల్‌జెన్ విద్యార్థులు విన్నర్స్‌గా, ప్రగతి పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ నేపథ్యంలో కరస్పాండెంట్ విద్యార్థులను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మడకశిర/గుడిబండ/రొళ్ల: భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అలాగే గుడిబండ మండల పరిధిలోని ఎస్.రాయాపురం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు అందినట్లు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్ తెలిపారు. రొళ్ల మండల పరిధిలోని తూభినకుంట రెవెన్యూ గ్రామంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. 7 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సంఘాల నిర్వహణపై శిక్షణ

అమరాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల ఈసీ సభ్యులకు సీఆర్పీలు అనురాధ, అశ్విని బుధవారం శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాలు ఏ విధంగా నడచుకోవాలి, సంఘాల నిర్వహణ, విధులు, బాధ్యతల గురించి వివరించారు. ప్రతి సంఘాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. తీసుకున్న రుణాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి, వాటిని తిరిగి ఏవిధంగా వాయిదాల ప్రకారం చెల్లించాలి తదితర వాటి గురించి శిక్షణ ఇచ్చారు.

జగన్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయండి

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈనెల 21న నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ గ్రామానా కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

హక్కుల పరిరక్షణే రాజ్యాంగ లక్ష్యం



మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరెడ్డి

హిందూపురం అర్బన్: బాధ్యతలను గుర్తు చేయడంతో పాటు హక్కులను పరరక్షించడమే భారత రాజ్యాంగ ముఖ్య ఉద్దేశ్యమని స్థానిక న్యాయవాదులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అజీజియా మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, నవేరా, సంతోషి కుమారి హబ్బాలు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో అన్ని కులాలు, మతాలు వారికి సమాన హక్కులు ఇవ్వడం జరిగిందన్నారు. మైనార్టీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలనే వారికి రిజర్వేషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట పట్టణంలోని ఆర్వీపీ (రాష్ట్రీయ విద్యా పీఠ) పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత మళ్లీ కలిశారు. అదే పాఠశాలలో గురు వందన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ మహ్మద్ హుసేన్ మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువులను మేళతాళాలతో పట్టణం ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి



ఎస్సీ, ఎస్టీ సమస్య పరిష్కార సభలో పాల్గొన్న అధికారులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా నెలకొన్న ఎస్సీ, ఎస్టీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్థానిక దళిత నాయకుడు డీజేఎస్ నారాయణప్ప సూచించారు. స్థానిక నూతన అంబేడ్కర్ భవనంలో బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కార సభలో ఆయన మాట్లాడుతూ శివా సాగు భూముల సాగు పత్రాలను సంబంధిత రైతులకు త్వరితగతిన అందించాలని డిమాండ్ చేశారు. వాల్మీకి సంఘం నాయకుడు పాళేగార్ లోకేశ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సహాయ ధనంలో 25 శాతం ధనాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించ దానికి కేటాయించాలన్నారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరాం, సీఐ సురేశ్, దళిత నాయకులు సీకే తిప్పేస్వామి, యోగీశ్, వళ్లూరు నాగేశ్, న్యాయవాది రవీంద్ర, వడ్డెర బంగారప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కొడిగానిపల్లి గ్రామ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కదిరేపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో కిష్టప్ప, ఆనంద్ పాపసానిపల్లి గ్రామానికి వెళ్తున్నారు. అటు వైపు నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. గాయపడిన కిష్టప్ప, ఆనంద్‌లను 108 వాహనంలో మడకశిరకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కిష్టప్పను బెంగళూరుకు తరలించారు.